క్లుప్తంగా

3న భీమడోలులో రైతు సంఘం జిల్లా సమావేశం



సమావేశంలో మాట్లాడుతున్న రైతు సంఘం అధ్యక్ష, కార్యదర్శులు నర్సింహా, శ్రీనివాస్

ఏలూరు (టూటౌన్) : ఈ నెల 3న ఏపీ రైతు సంఘం జిల్లా విస్తృత సమావేశం ఉదయం 10 గంటలకు భీమడోలు జంక్షన్‌లోని కాట్రగడ్డ మధుసూదనరావు అన్నపూర్ణ కల్యాణ మండపంలో నిర్వహిస్తున్నట్లు సంఘం అధ్యక్ష, కార్యదర్శులు నిమ్మగడ్డ నర్సింహా ,కె.శ్రీనివాస్‌లు తెలియజేసారు. ఈ మేరకు స్థానిక పవరుపేటలోని సంఘం కార్యాలయం నందు గురువారం నిర్వహించిన సమావేశంలో దీనికి సంబంధించిన వివరాలను తెలియజేసారు. ఈ సమావేశాలకు జిల్లాలోని అన్ని మండలాల నుంచి అన్ని పంటలకు సంబంధించిన రైతు ప్రతినిధులను ఆహ్వానించినట్లు చెప్పారు. రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి కె.ప్రభాకర రెడ్డి ముఖ్య అతిథిగా విచ్చేస్తున్నారని తెలిపారు. ఈ సమావేశాల్లో గ్రామస్థాయిలో రైతు సంఘాన్ని బలోపేతం చేసేందుకు అన్ని పంటల రైతుల సమస్యలు భవిష్యత్ కార్యాచరణ రూపొందిస్తామని చెప్పారు.

ఆత్మీయ కలయిక

సజ్జలను కలిసిన వక్ఫ్‌బోర్డు వైస్ ఛైర్మన్ అక్బర్



ఏలూరు (ఆర్ఆర్‌పేట): జిల్లా వక్ఫ్‌బోర్డు వైస్ ఛైర్మన్ ఎస్ఎం అక్బర్ రాష్ట్ర ప్రభుత్వ ముఖ్య సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డిని శుక్రవారం విజయవాడలో కలిశారు. వైసీపీ రాష్ట్ర మైనార్టీ సమావేశం సందర్భంగా సజ్జలను కలిసి పుష్పగుచ్ఛం అందించి కృతజ్ఞతలు తెలిపారు. ఆయనతో పాటు డిప్యూటీ సీఎం అంజాద్ భాషా, వక్ఫ్‌బోర్డు ఛైర్మన్ ఖాదర్ భాషాలను సైతం మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వక్ఫ్‌బోర్డు ద్వారా ముస్లింల అభివృద్ధికి కృషి చేయాలని సూచించారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ఏలూరు (ఆర్ఆర్‌పేట): నగరంలోని సత్రంపాడు11 కేవీ ఫీడర్, సిద్ధార్థ 11 కేవీ ఫీడర్ పరిధిలో విద్యుత్ మరమ్మతులు, చెట్లు కొట్టే నిమిత్తం శుక్రవారం నగరంలోని పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఈపీడీసీఎల్ ఏలూరు ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ టీ. శశిధర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు నగరంలోని ఆర్టీసీ కాలనీ, సిద్ధార్థ మెయిన్ రోడ్డు, అంబికా దేవి దేవస్థానం ప్రాంతాల్లో ఉదయం 9.30 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకూ విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు తెలిపారు.

శిరస్త్రాణం ధరించాలంటూ అవగాహన

ఏలూరు టౌన్: రోడ్డు ప్రమాదాల నివారణకు వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని, రోడ్డుపై ప్రయాణిస్తోన్న సమయంలో తమ కుటుంబం పట్ల బాధ్యతను గుర్తించి క్షేమంగా ఇంటికి చేరుకునేలా చూసుకోవాలని ఏలూరు టూటౌన్ ఎస్సై కే.ప్రసాద్ తెలిపారు. ఏలూరు జిల్లా ఎస్పీ రాహుల్‌దేవ్ శర్మ, ఏలూరు ఇన్‌ఛార్జ్ డీఎస్పీ జీవీఎస్ పైడేశ్వరరావు ఆదేశాల మేరకు టూటౌన్ సీఐ పీ.చంద్రశేఖర్ ఆధ్వర్యంలో నగరంలోని పలు ప్రాంతాల్లో మోటారు సైకిళ్ల తనిఖీలు చేపట్టారు. వాహనదారులు సరైన పత్రాలు కలిగి ఉన్నారా లేదా అనేది ఆరా తీయటంతోపాటు, విధిగా హెల్మెట్ ధరించేలా అవగాహన కల్పించారు. హెల్మెట్ ధరించడం వల్ల కలిగే ప్రయోజనాలను వివరించారు. తొలుత హెల్మెట్ ధరించటంపై అవగాహన కల్పిస్తున్నామనీ, అనంతరం నిబంధనలు ఉల్లంఘించిన వారిపై జరిమానాలు విధిస్తామని ఎస్సై ప్రసాద్ తెలిపారు.

యువతకు అవగాహన : వన్‌టౌన్ ఎస్ఐ రామకృష్ణ

ఏలూరు నగరంలో వాహనదారులు తప్పకుండా మోటారు సైకిల్‌పై ప్రయాణించే సమయంలో హెల్మెట్ వినియోగించేలా అవగాహన కల్పిస్తున్నామని ఏలూరు వన్‌టౌన్ ఎస్సై ఎస్.రామకృష్ణ తెలిపారు. వన్‌టౌన్‌లోని పలు ప్రాంతాల్లో గురువారం వాహన తనిఖీలు చేపట్టారు. ఈ సదర్భంగా వాహనదారులైన యువతకు రోడ్డు ప్రమాదాలు, నివారణ, హెల్మెట్ వినియోగంతో ఉపయోగాలను ఆయన వివరించారు. యువత రోడ్డు ప్రమాదాల్లో మృత్యువాతకు గురికావటం అత్యంత బాధాకరమనీ, ప్రాణనష్టాన్ని తగ్గించేందుకు తప్పకుండా హెల్మెట్ ధరించాలని కోరారు. రాబోయే రోజుల్లో మోటారు సైకిల్‌పై ప్రయాణించేవారు హెల్మెట్ ధరించకపోతే జరిమానాలు విధిస్తామని ఆయన తెలిపారు.



ఏలూరులో వాహనదారులతో హెల్మెట్ కొనుగోలు చేయిస్తోన్న టూటౌన్ ఎస్సై కే.ప్రసాద్



ఏలూరులో వాహనదారునితో హెల్మెట్‌పై అవగాహన కల్పిస్తోన్న వన్‌టౌన్ ఎస్సై రామకృష్ణ

నేడు గృహసారథుల ఆత్మీయ సమావేశం

ముఖ్యఅతిథిగా ఏలూరు జిల్లా అధ్యక్షులు, ఎమ్మెల్యే ఆళ్ల నాని



ఏలూరు టౌన్: ఏలూరు నియోజకవర్గంలో వైఎస్సార్‌సీపీ బలోపేతానికి ఏలూరు జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్యే ఆళ్లనాని ప్రత్యేక చర్యలు చేపట్టారు. వైఎస్సార్‌సీపీ అధ్యక్షులు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాలతో కేంద్ర కార్యాలయం సూచనల మేరకు ఏలూరు నియోజకవర్గంలో ఇప్పటికే సచివాలయ కన్వీనర్లను నియమించారు. ఇక తాజాగా గృహసారథుల నియామకం జాబితాను సిద్ధం చేసి కేంద్ర కార్యాలయానికి అందజేశారు. వీరంతా ఏలూరు నియోజకవర్గంలో ఎమ్మెల్యే నాని ఆదేశాల మేరకు పార్టీ నిర్దేశించిన కార్యక్రమాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకువెళ్లటం ప్రధాన లక్ష్యంగా ఉంది. ఈనెల 3న శుక్రవారం ఉదయం 9.30గంటలకు ఏలూరు శనివారపుపేట సారథి కల్యాణ మండపంలో గృహ సారథుల ఆత్మీయ సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఏలూరు నగరంలోని గృహసారథులు, వలంటీర్లు, సచివాలయ కన్వీనర్లు హాజరు కావాలని తెలిపారు. ఏలూరు నగరంలోని 1వ డివిజన్ నుంచి 17వ డివిజన్ వరకూ, 34డివిజన్ కు సంబంధించిన వారు సమావేశానికి హాజరుకావాల్సి ఉందని పార్టీ నగర అధ్యక్షుడు బొద్దాని శ్రీనివాస్ తెలిపారు. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా ఏలూరు ఎమ్మెల్యే ఆళ్లనాని హాజరవుతారని తెలిపారు. ఏలూరు మేయర్ నూర్జహాన్, డిప్యూటీ మేయర్లు, కార్పొరేటర్లు, కోఆప్షన్ సభ్యులు, వైఎస్సార్‌సీపీ ఆయా విభాగాల నాయకులు, హాజరుకావాలన్నారు.

5వ తేదీ నుంచి ముగియనున్న ఖరీఫ్ ధాన్యం కొనుగోలు

- ఇంతవరకు 3.66 లక్షల మెట్రిక్ టన్నులు ధాన్యం కొనుగోలు
- కొనుగోలు చేసిన ధాన్యానికి రూ.628 కోట్లు రైతుల ఖాతలకు జమ
- జాయింట్ కలెక్టర్ పి.అరుణ్ బాబు



ఏలూరు(మెట్రో): ఏలూరు జిల్లాలో 2022-23 సంవత్సరం యొక్క ఖరీఫ్ పంటనకు సంబంధించి ఈ నెల 5వ తేదీ అనంతరం ఖరీఫ్ ధాన్యం కొనుగోలు ముగియనున్నట్లు జాయింట్ కలెక్టర్ పి.అరుణ్ బాబు తెలియజేశారు. జిల్లాలో ధాన్యం కొనుగోలు ప్రక్రియ 2022 నవంబర్ 6 నుంచి ప్రారంభించి , ఇప్పటి వరకు జిల్లాలో 3.66 లక్షల మెట్రిక్ టన్నులు ధాన్యాన్ని కొనుగోలు చేసి, అందుకు సంబంధించిన ధాన్యం సొమ్ములు రూ.628 కోట్లు రైతుల యొక్క వ్యక్తి గత ఖాతాలకు జమ జేయడం జరిగిందన్నారు. జిల్లాలోని 284 ఆర్.బి.కే కేంద్రాల ద్వారా నవంబర్ 6వ తేదీ నుంచి ఈనెల 5వ తేదీ వరకు అనగా 92 రోజులు పాటు రైతుల వద్ద నుంచి ధాన్యం కొనుగోలు చేయుటకు జిల్లా అధికారులు నిర్ణయించినందున జిల్లాలో ఈ నెల 5 వతేదీ అనంతరం అన్నీ కేంద్రాల్లో ధాన్యం కొనుగోళ్లు ముగుస్తుందని రైతులు దీనిని గమనించాలన్నారు.

ఏప్రిల్ 5న చలో ఢిల్లీని విజయవంతం చేయండి

ఏలూరు (టూటౌన్) : కేంద్ర రవాణా రంగ చట్టసవరణకు వ్యతిరేకంగా ఏప్రిల్ 5న చలో ఢీల్లీ మహాధర్నాలో డ్రైవర్లు అందరూ పాల్గొనాలని యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ముజఫర్ అహ్మద్ పిలుపునిచ్చారు. స్థానిక నరసింహారావుపేటలోని సీఐటియూ జిల్లా కార్యాలయంలో ఆటో అండ్ ట్రాన్స్‌పోర్టు యూనియన్ జిల్లా కమిటీ సమావేశం గురువారం జరిగింది. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ సంవత్సరానికి 2.79లక్షల కోట్లు పన్నుల రూపంలో గుంజుకుంటున్న కేంద్ర ప్రభుత్వం రవాణా రంగానికి బడ్జెట్ కేటాయింపుల్లో మొండి చేయి చూపించారన్నారు. ప్రతి సంవత్సరం వాహన ఇన్సూరెన్స్ కంపెనీలు 20 శాతం ప్రీమియం పెంచుకునేందుకు కేంద్ర ప్రభుత్వం సవరించిన రవాణా రంగ చట్టం వీలు కల్పించిందని ఆందోళన వ్యక్తం చేసారు. రవాణా రంగంలో పనిచేస్తున్న కార్మికులందరికీ సమగ్ర సంక్షేమ బోర్డును ఏర్పాటు చేయాలని కోరారు. సీఐటియూ జిల్లా అధ్యక్షుడు ఆర్ లింగరాజు మాట్లాడుతూ ప్రమాదాలు జరిగినప్పుడు డ్రైవర్లపై 302(ఎ) సెక్షన్ కింద అరెస్టు చేసేందుకు అవకాశం కల్పించిన జీవో నెంబరు 21ని రద్దు చేయాలని కోరారు. పెట్రోల్, డీజిల్‌పై లీటరుకు ఒక రూపాయి సెస్సు వసూలు చేస్తున్న ప్రభుత్వం రోడ్ల మరమ్మత్తులకు ఎటువంటి చర్యలు తీసుకోవడం లేదని ఆక్షేపించారు. రవాణా రంగ చట్ట సవరణ బడా కార్పొరేట్ కంపెనీలైన ఉబర్, ఓలా వంటి సంస్థల వాహనాలకు పట్టణాల్లో పార్కింగ్ సౌకర్యం కల్పించిన ప్రభుత్వం, ఆటో డ్రైవర్లకు పార్కింగ్ సౌకర్యం కల్పించడం లేదన్నారు. ఈ సమావేశంలో యూనియన్ అధ్యక్ష,కార్యదర్శులు బుద్ధ నాగసూరిబాబు, జె.గోపి,కోశాధికారి డి.థామస్, నగర అధ్యక్ష,కార్యదర్శులు సిహెచ్ అమర్ కుమార్, జివి రవీంద్రబాబు,కెవివి సత్యనారాయణ, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.



ఆటో అండ్ ట్రాన్స్‌పోర్టు కమిటీ సమావేశంలో మాట్లాడుతున్న యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ముజఫర్ అహ్మద్

నిరాశపరచిన నిర్మలమ్మ బడ్జెట్

ఏలూరు (టూటౌన్) : కేంద్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన బడ్జెట్ తీవ్ర నిరాశపర్చిందని సీఐటియూ రాష్ట్ర కార్యదర్శి ముజఫర్ అహ్మద్ అన్నారు. స్థానిక ఆర్టీసీ బస్టాండ్ సెంటర్‌లో సీఐటీయూ ఆధ్వర్యంలో కేంద్ర బడ్జెట్‌ను వ్యతిరేకిస్తూ గురువారం నిరసన వ్యక్తం చేసారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అంబానీ, అదానీలకు తప్ప అన్ని వర్గాల ప్రజలకు వ్యతిరేకంగా బడ్జెట్ ఉందన్నారు. కార్మిక, కర్షకులకు, ఉద్యోగ, వ్యాపార వర్గాలకు ద్రోహం చేసేలా బడ్జెట్ ఉందని విమర్శించారు. సీఐటీయూ జిల్లా అధ్యక్ష,ప్రదాన కార్యదర్శులు ఆర్ లింగరాజు,డిఎన్‌విడి ప్రసాద్‌లు మాట్లాడుతూ ఏపీకి ప్రత్యేక హోదా, విభజన హామీలు, పోలవరం, అమరావతి లాంటి వాటికి నిధులు కేటాయించక పోవడం దారుణమన్నారు. ఐసీడీఎస్, ఉపాధి హామీకి, విద్య, వైద్యం, ఆహారం, వంటి వాటికి నిధులు కోత పెట్టారన్నారు. ప్రభుత్వ రంగ సంస్థలను అమ్మి వాటితో మౌలిక సౌకర్యాలు కల్పిస్తామని చెప్పడం సిగ్గు చేటన్నారు. ఈ కార్యక్రమంలో ఆటో యూనియన్ జిల్లా కార్యదర్శి జె.గోపి, నగర నాయకులు రవీంద్ర, సీహెచ్ అమర్ కుమార్, టి.థామస్, టి.సత్యనారాయణ ,కె.విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



కేంద్ర బడ్జెట్‌కు వ్యతిరేకంగా ధర్నా నిర్వహిస్తున్న సీఐటియూ నాయకులు

మున్సిపల్ కార్మికుల సమ్మె వాయిదా

ఏలూరు (టూటౌన్): ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో ఈనెల 6న తలపెట్టిన సమ్మె వాయిదా వేసినట్లు యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు భజంత్రీ శ్రీనివాసరావు తెలిపారు. యూనియన్ ముఖ్యకార్యకర్తల సమావేశం స్థానిక సీపీఐ జిల్లా కార్యాలయంలో యూనియన్ నగర అధ్యక్షుడు ఎలగాడ దుర్గారావు అధ్యక్షతన గురువారం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏలూరు నగరపాలక సంస్థ హెల్త్ విభాగం, కాంట్రాక్ట్ ఔట్‌సోర్సింగ్ కార్మికులకు 6 నెలల హెల్త్ అలవెన్స్, ఓహెచ్ఓ, కార్పొరేషన్‌లో విలీనమైన 7 పంచాయతీ కార్మికులకు 8 నెలల హెల్త్ అలవెన్స్ ఓహెచ్ఓ కార్మికులకు రావాల్సిన బకాయిలు రూ.4 కోట్లు కార్మికులకు నేరుగా ఖాతాల్లో వేశారని తెలిపారు. బకాయిలు చెల్లించిన కారణంగా సమ్మె వాయిదా వేస్తున్నామని తెలియజేసారు. తమ బకాయిలు చెల్లించినందుకు నగర కార్పొరేషన్ ఇంఛార్జీ కమిషనర్ జాయింట్ కలెక్టర్ పి.అరుణబాబు, ఇతర ఉన్నతాధికారులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సమావేశంలో కార్యనిర్వాహక అధ్యక్షులు యలగాడ శివకుమార్, యూనియన్ సహాయ కార్యదర్శి ఇంటి అశోక్, కౌన్సిల్ సభ్యులు కదరబోయిన భాస్కరరావు, మాడుగుల జగదీష్, బంగారు కృష్ణ, సిహెచ్ మోహన్, అంతరాజు లీల ప్రసాద్,వంతం శోభన్‌బాబు, కిలారి వెంకన్న, ధనియాల పద్మావతి తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు భజంత్రీ శ్రీనివాసరావు

వలంటీర్ సేవాదృక్పథం



హాస్పిటల్‌లో చికిత్స పొందుతున్న జ్యోతికి పింఛన్ అందజేస్తున్న వలంటీర్

ఏలూరు (ఆర్ఆర్‌పేట): అనారోగ్యంతో విజయవాడ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న నగరంలోని 45వ డివిజన్ ఆదివారపు పేటకు చెందిన మహిళకు స్థానిక వలంటీర్ ఆసుపత్రికి వెళ్లి పింఛన్ అందజేసింది. స్థానిక 19వ వార్డు సచివాలయం పరిధిలోని 45వ డివిజన్‌లో నివాసముంటున్న వానపల్లి జ్యోతి అనే మహిళ అనారోగ్యంతో విజయవాడ హాస్పిటల్‌లో చికిత్స పొందుతోంది. ఈ విషయం తెలుసుకున్న స్థానిక వలంటీర్ కాగాని అనురాధ ఏలూరు నుంచి విజయవాడలోని హాస్పిటల్‌కు గురువారం వెళ్లి వైఎస్సార్ విడో సామాజిక పింఛన్ సొమ్మును అందజేసింది.

ఉపాధి హామీ పథకానికి కోతలు విధించడం దారుణం

ఏలూరు (టూటౌన్): కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ప్రవేశ పెట్టిన 2023-24 కేంద్ర బడ్జెట్లో ఉపాధి హామీ పథకానికి భారీ కోత విధించి కేవలం రూ.60వేల కోట్లు కేటాయించడం దారుణమని ఏపీ కార్మిక సంఘం, బికేఎంయు రాష్ట్ర ఉపాధ్యక్షుడు బండి వెంకటేశ్వరరావు ఒక ప్రకటనలో విమర్శించారు.గ్రామీణ పేదలను, కష్ట జీవులను తీవ్రంగా మోసగించిన బడ్జెట్ అంటూ దుయ్యబట్టారు. 2021-22లో రూ.98వేలు కోట్లు, 2022-23లో రూ.73 వేలు కోట్లు, తాజాగా 2023-24 బడ్జెట్లో రూ.60 వేలు కోట్లు కేటాయింపులు చేసారన్నారు. క్రమంగా ఉపాధి హామీ పథకానికి నిధుల కేటాయింపు తగ్గిస్తూ వస్తున్న కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ఈ పథకాన్ని పూర్తిగా నీరుగార్చే ప్రయత్నం చేయడం సిగ్గు చేటన్నారు. కేంద్ర బడ్జెట్లో ఉపాధి హామీ పథకానికి రూ.2లక్షల కోట్లు కేటాయించాలని, పట్టణ ప్రాంత పేద ప్రజలకు కూడా ఈ పథకాన్ని వర్తింప చేయాలని బండి వెంకటేశ్వరరావు కోరారు.

దోసపాడు భూములపై 144 సెక్షన్ ఎత్తివేయాలి

ఏలూరు (టూటౌన్): దెందులూరు మండలం దోసపాడు భూములపై 144 సెక్షన్ ఎత్తివేయాలని,145 సెక్షన్ ప్రకారం పంట స్వాధీనపరుచకోవాలని ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఏ.రవి కోరారు. స్థానిక పవరుపేటలోని అన్నేభవన్ నందు గురువారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. దోసాపడు పేదల భూములు అన్యాక్రాంతం చేసిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని, ఆక్రమణ దారులపై ఎస్సీ,ఎస్టీ అట్రాసిటీ చట్టం ప్రకారం కేసు నమోదు చేయాలని కోరారు. భూములను దళితులు,పేదలకు అప్పగించాలన్నారు. కోనేరు రంగారావు భూ కమిటీ సిఫార్సులు, జీవోలు అమలు చేయాలని కోరారు. అసైన్డ్ సీలింగ్ చట్టాల అమలు చేయాలని, 9/77 చట్టం ప్రకారం పేదలు, దళితుల భూములు వారికే ఇవ్వాలని ఆయన కోరారు. జాయింట్ కలెక్టర్ ఆదేశాలను తుంగలోకి త్రొక్కిన వారిపై చర్యలు తీసుకోవాలన్నారు. ఈ నెల 8న టి.నర్సాపురంలో జరిగే జిల్లా సదస్సులో భూస్వాధీన ఉద్యమానికి కార్యాచరణ రూపొందించనున్నట్లు తెలియజేసారు. ఈ సమావేశంలో సంఘం జిల్లా కార్యదర్శి పి.రామకృష్ణ, నాయకులు పి.ఆనందరావు, సీహెచ్ జాన్ రాజు, డి.నాగేందర, కె.వినోద్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఏ.రవి

చేనేత రిజర్వేషన్ చట్టాన్ని పటిష్టంగా అమలు చేయాలి

ఏలూరు (టూటౌన్): కేంద్ర బడ్జెట్‌లో చేనేత రంగానికి మొండి చెయ్యి చూపారని ఏపీ చేనేత కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి పిచ్చుక ఆదిశేషు ఆందోళన వ్యక్తం చేసారు. ఈ మేరకు ఒక ప్రకటన విడుదల చేసారు. దేశంలో వ్యవసాయ రంగం తరువాత అత్యధిక మందికి ఉపాధి కల్పించేది చేనేత రంగమని గుర్తు చేసారు. మూడుకోట్ల మంది చేనేత వృత్తిపై ఆధారపడి జీవిస్తున్నారని గత కొన్ని సంవత్సరాలుగా కేంద్ర ప్రభుత్వం చేనేత రంగాన్ని విస్మరిస్తూ బడ్జెట్ కేటాయింపుల్లో తీవ్ర అన్యాయం చేస్తున్నారన్నారు. కేంద్ర ప్రభుత్వం తన బడ్జెట్‌లో కేవలం రూ.200 కోట్లు మాత్రమే కేటాయించడాన్ని తప్పుబట్టారు. ఇప్పటికే చేనేతపై జీఎస్టీ విధించిన కేంద్రం చేనేత కార్మికులను అగాధంలోకి నెట్టివేసిందన్నారు. దేశంలో చేనేత రంగం బతికి బట్ట కట్టాలంటే చేనేత రిజర్వేషన్ చట్టాన్ని పటిష్టంగా అమలు చేయాలని, చేనేత రంగానికి బడ్జెట్‌లో రూ.10వేలు కోట్లు కేటాయించాలని పిచ్చుక ఆదిశేషు కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

ఈ-పంట నమోదు తప్పనిసరి

టి.నరసాపురం : రబీ 2023 సీజన్‌కు సంబంధించి ఈ-పంట నమోదు ప్రక్రియను క్షేత్ర పర్యటన ద్వారా పరిశీలిస్తున్నట్లు చింతలపూడి సహాయ వ్యవసాయ సంచాలకులు బి.నాగకుమార్ తెలిపారు. గురువారం మండలంలోని తెడ్లం, రాజుపోతేపల్లి, కేతవరం, బంధంచర్ల, టి.నరసాపురం, గుర్వాయిగూడెం, కృష్ణాపురం గ్రామాల్లో వ్యవసాయ అధికారులతో కలిసి ఆయన పర్యటించారు. ఈ-పంట నమోదు గ్రామస్థాయిలో వ్యవసాయ సహాయకులు చేస్తున్నారా లేదా, సరైన ప్రక్రియలోనే ఈ-పంట నమోదు జరుగుతుందా అనే అంశాలను తనిఖీ చేసినట్లు నాగకుమార్ తెలిపారు. సాగు చేసే ప్రతి పంటకు ఈ-పంట నమోదు తప్పనిసరి అన్నారు. ఈ సందర్భంగా గ్రామ వ్యవసాయ సహాయకులతో సమావేశం నిర్వహించారు. సమావేశంలో గ్రామాల్లో నూతనంగా నిర్మిస్తున్న రైతు భరోసా కేంద్రాలు త్వరలోనే పూర్తిచేసి వాటి ద్వారానే రైతులకు సేవలు అందించాలన్నారు. గ్రామంలో అసలు భూమి లేని కౌలు సాగు రైతులందరికీ పంట సాగుదారు హక్కు పత్రాలు అందించాలన్నారు. రైతు భరోసా పథకంలో కౌలు సాగుదారులను నమోదుచేసి వారికి కూడా పథకం వర్తింపచేయాలన్నారు. పీఎం కిసాన్ పథకంలో అందరు రైతులను నమోదు చేసి వారికి ఈ-కేవైసీ చేసి పీఎం కిసాన్ సొమ్ములు అందేలా చర్యలు తీసుకోవాలన్నారు.



పంటలను పరిశీలిస్తున్న అధికారులు

దళితవాడలు నూతన గ్రామ పంచాయతీలు కావాలి

దెందులూరు : భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఆశయాలకు అనుగుణంగా అంబేడ్కర్ ఇండియన్ మిషన్ వ్యవస్థాపకులు, డీజీపీ పీవీ సునీల్ కుమార్ కలలు సాకారం చేసే దిశగా కృషి జరగాలని అంబేడ్కర్ ఇండియన్ మిషన్ జిల్లా ఇన్‌చార్జి పాడేటి రాంబాబు అన్నారు. జిల్లాలోని మండలాల పర్యటనలో భాగంగా గురువారం దెందులూరులో ఆయన విలేకరులతో మాట్లాడారు. దళిత గిరిజనుల అభివృద్ధి, ఉన్నతమైన జీవనవిధానం కోసం విద్య ఒక్కటే మార్గమన్నారు. ప్రతి ఒక్కరూ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఆలోచన విధానంలో పయనించాలని, ఆయన ఆశయాలకు అనుగుణంగా కృషి చేయాలన్నారు. అన్ని మండలాల శివారు ప్రాంతాల్లో దళితవాడల్లో నూతన గ్రామ పంచాయతీలుగా రూపాంతరం చెందాలన్న మహా ఉద్యమానికి ప్రతి ఒక్కరూ తమ వంతు సహాయ సహకారాలు అందించాలని కోరారు. అంబేడ్కర్ మిషన్ తరపున గిరిజన గ్రామాల్లో ర్యాలీలు, అవగాహన సదస్సులు, గృహదర్శన్‌లు చేస్తున్నామని రాంబాబు వివరించారు.

గిరిజన ప్రాంతంలో ప్రకృతి వ్యవసాయాభివృద్ధికి కృషి

బుట్టాయగూడెం : గిరిజన ప్రాంతంలో ప్రభుత్వ ఆదేశాలతో కేఆర్‌పురం ఐటీడీఏ సహకారంతో ప్రకృతి వ్యవసాయాభివృద్ధికి ప్రత్యేక కృషి చేయనున్నట్లు ఏపీసీఎన్ఎఫ్ కేఆర్‌పురం జోనల్ కోఆర్డినేటర్ వై.మునలయ్య తెలిపారు. గురువారం సాయంత్రం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ గిరిజన ప్రాంతంలో ప్రకృతి వ్యవసాయాభివృద్ధి కోసం ఎనలేని కృషి చేస్తున్నామని చెప్పారు. కేఆర్‌పురం డివిజన్ పరిధిలో సుమారు 15 వేల మందికి పైగా రైతులు 9,400 ఎకరాల్లో వివిధ రకాల పంటలు పండిస్తున్నట్లు చెప్పారు. వరి, ప్రత్తి, జీడిమామిడి, పెసలు, మినుము, మొక్కజొన్న, నవధాన్యాల పంటలు పండిస్తూ లాభాలు పొందుతున్నారన్నారు. అలాగే 200 ఎకరాలకు పైగా కూరగాయల సాగును చేస్తున్నారని చెప్పారు. పొట్లకాయ, ఆనపకాయ, దోసకాయ, చిక్కుడు, బీర, టమాట వంటి పంటలు పండిస్తూ ఆదాయాలు పొందుతున్నారని చెప్పారు. రాబోయే రోజుల్లో ప్రత్యేకమైన ప్రణాళికలతో గిరిజన ప్రాంతంలో ప్రకృతి వ్యవసాయాభివృద్ధికి ఉన్నతాధికారులు కృషి చేస్తున్నట్లు తెలిపారు.

కూరగాయల ధరలు

ఏలూరు నగరంలోని రైతు బజార్లలో కూరగాయల ధరలు

కూరగాయలు	కిలో ధర	కూరగాయలు	కిలో ధర
టమాటాలు	22	అరటి కాయ (1)	05-07
వంకాయలు (గులాబీ)	14	చిక్కుడు కాయలు	48
వంకాయలు (కాంతులు)	20	చామదుంపలు	54
వంకాయలు (తెలుపు)	24	ములక్కాడలు	15
బెండకాయలు	56	కంద	40
పచ్చిమిర్చి	26	బీట్‌రూట్	34
కాకర కాయలు	30-34	కీరా దోస	44
బీరకాయలు	60	ఫ్రెంచ్‌బీన్స్	46
బీరకాయలు (పందిరి)	70	అల్లం	68
క్యాబేజీ	16	కొత్తిమీర (కట్ట)	15
క్యారెట్	34	పాలకూర	08
దొండకాయలు	30	చుక్కకూర	08
బంగాళదుంపలు	25	తోటకూర	08
ఉల్లిపాయలు	26	గోంగూర	08
గోరుచిక్కుడు	44	పుదీనా	05
దోసకాయలు	30	బఠాణి	--
ఆనబకాయ (1)	20	క్యాప్సికమ్	56
పొట్లకాయ(1)	20	చిలకడదుంప	24-30

ఆర్టీసీ సమాచారం

ఏలూరు ఆర్టీసీ డిపో నుంచి దూరప్రాంతాలకు వెళ్లే బస్సుల సమయాలు, రిజర్వేషన్ వివరాలు

ఏసీ బస్సులు..

బస్సు రూటు	సమయం	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు -బీహెచ్ఈఎల్ వయా విజయవాడ (ఇంద్ర)	21.00	23
ఏలూరు -బీహెచ్ఈఎల్ వయా ఖమ్మం (ఇంద్ర)	21.00	33
ఏలూరు - బీహెచ్ఈఎల్ (అమరావతి)	22.00	39
ఏలూరు - తిరుపతి(ఇంద్ర)	19.00	31

సూపర్ లగ్జరీ

బస్సు రూటు	సమయం	సర్వీస్ నంబర్	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు -బీహెచ్ఈఎల్	21.45	4820	10
ఏలూరు -బీహెచ్ఈఎల్ వయా కే.కోట	19.30	4796	21
ఏలూరు -బీహెచ్ఈఎల్ వయా రామచంద్రపురం	19.45	4798	21
ఏలూరు -జీడిమెట్ల వయా ఖమ్మం	20.15	4802	24
ఏలూరు -ఈసీఐఎల్	22.30	4814	22
ఏలూరు - బీహెచ్ఈఎల్	22.15	34820	16
ఏలూరు -బీహెచ్ఈఎల్	09.00	4794	32
ఏలూరు - విశాఖపట్నం	12.00	4840	32
ఏలూరు -విశాఖపట్నం	22.00	4838	34
ఏలూరు - తిరుపతి	16.00	4830	32